సాక్షి
తూర్పుగోదావరి


బుధవారం । 11 । జనవరి । 2023

I



లోవ మంటపానికి విరాళం

తుని రూరల్: తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఐదంతస్తుల మహా మంటపం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన భక్తుడు రూ.51 వేల విరాళం సమర్పించినట్టు దేవస్థానం సిబ్బంది వెంకటరమణ, రామకృష్ణ తెలిపారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 8,970 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. తూర్పు 2,650, సెంట్రల్ 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కులు వదిలారు.

పతాక నిధికి విరాళం



కాకినాడ సిటీ: సాయుధ దళాల పతాక నిధికి ఎక్స్ సర్వీస్‌మెన్ హెల్ప్‌లైన్ సంస్థ (కాకినాడ) అధ్యక్షుడు అడపా శంకర్, సంస్థ సభ్యులతో కలిసి రూ.1,15,000 చెక్కును కలెక్టర్ కృతికా శుక్లా చేతుల మీదుగా మంగళవారం జిల్లా సైనిక సంక్షేమ శాఖకు అందజేశారు.

న్యూస్‌రీల్

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పండగ నేపథ్యంలో జిల్లా మీదుగా ఈ నెల 12, 13, 14 తేదీల్లో మూడు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ప్రకటించారు. 12వ తేదీన నడిచే సికింద్రాబాద్ – కాకినాడ టౌన్ (07571) రైలు రాజమహేంద్రవరం, అనపర్తి, సామర్లకోట రైల్వేస్టేషన్లలో ఆగుతుంది. 13, 14 తేదీల్లో కాకినాడ టౌన్ – తిరుపతి – కాకినాడ టౌన్ (07573/07574) రాకపోకలు సాగిస్తాయి. ఇవి సామర్లకోట, రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్లలో ఆగుతాయి.

వివిధ కోర్సులలో శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు కలెక్టరేట్ ఆవరణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్(నేక్)లో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్, సర్వేయింగ్, రిఫ్రిజిరేషన్ అండ్ ఏసీ వర్క్స్ కోర్సులలో మూడు నెలల శిక్షణ ఇవ్వనున్నట్లు నేక్ ఇన్‌చార్జి పరిమళ జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లమో, బీటెక్ చదివి 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజనం సదుపాయం కల్పిస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్లు అందజేసి, ఉద్యోగావకాశం కల్పిస్తామన్నారు. ఇతర వివరాలకు 96667 70760, 96667 71765, 89197 84495 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఆగ్రోరైతు సేవాకేంద్రాల ఏర్పాటు

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో ఆగ్రో రైతు సేవాకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా మేనేజర్ జాజుల కృష్ణయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సేవాకేంద్రం ద్వారా వ్యవసాయ యంత్రాలు, యాంత్రీకరణ పనిముట్లు రైతులకు విక్రయిస్తామన్నారు. వీటిని నిరుద్యోగ పట్టభద్రులు/పాలిటెక్నిక్ డిప్లమో అభ్యర్థులకు కేటాయిస్తామన్నారు. పూర్తి సమాచారం కోసం బొమ్మూరులోని గిరిజన యువశక్తి ట్రెనింగ్ సెంటర్(వైటీసీ) ఆవరణలో ఉన్న ఆగ్రోస్ జిల్లా మేనేజర్ కార్యాలయంలో లేదా 99480 76854 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

కడియం: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారకుడైన బస్సు డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ 7వ ఏజేఎఫ్‌సీఎం కోర్టు మేజిస్ట్రేట్ జి. రామకృష్ణ మంగళవారం తీర్పు చెప్పారు. కడియం పోలీసు ఇన్‌స్పెక్టర్ పీవీజీ తిలక్ తెలిపిన వివరాల ప్రకారం .. 2018 అక్టోబరు 5న వేమగిరి జంక్షన్‌లో ఆర్టీసీ బస్సు అదే గ్రామానికి చెందిన నులుకుర్తి సత్యనారాయణను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణ అదేనెల పదవ తేదీన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై అప్పటి ఎస్సై కె.సురేష్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ కేసును విచారించిన న్యాయమూర్తి.. బస్సు డ్రైవర్ బి. కృష్ణారావుకు రెండేళ్ల జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానాను విధించారు. పీపీగా ఓ. మహాలక్ష్మి వ్యవహరించారు. కోర్టు కానిస్టేబుల్ గంగాధర్ తదితరులను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

విన్నర్ రాజమహేంద్రవరం జట్టు

ముగిసిన ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ పోటీలు



ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ క్రికెట్ టోర్నీ విజేత రాజమహేంద్రవరం జట్టు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఇంటర్ సర్కిల్ క్రికెట్ పోటీలు కాకినాడలో మంగళవారంతో ముగిశాయి. కాకినాడ జిల్లా ఆర్ఎంసీ క్రీడామైదానంలో జరిగిన ఫైనల్స్‌లో రాజమహేంద్రవరం, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేసిన రాజమహేంద్రవరం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 154 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన డాక్టర్ ఎన్‌టీటీపీఎస్ జట్టు 8 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. మూడోస్థానంలో కడప జట్టు నిలిచింది. విజేతలకు ఏపీ ట్రాన్స్ కోడైరెక్టర్ భాస్కర్, సీఈ జోన్ విశాఖ భాగ్యరాజు, ఎస్ఈ బాబు, ఏపీ ట్రాన్స్‌కో అధికారులు సత్యం, వర్మ, రత్నాలరావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్.. ట్రబుల్

- ఉపాధిలో మరో సంస్కరణకు కేంద్రం శ్రీకారం
- ఒకే వ్యక్తికి రెండు జాబ్‌కార్డులపై దృష్టి
- ఆధార్ అనుసంధానంతో ఏరివేతకు చర్యలు
- జిల్లాలో 95 శాతం పూర్తయిన ప్రక్రియ
- 2.96 లక్షల ఉపాధి జాబ్ కార్డులు
- 44,483 మందికి పెండింగ్
- ప్రక్రియ పూర్తి కాకపోతే వేతనం నిలిపివేత



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

సాక్షి, రాజమహేంద్రవరం: ఉపాధి హామీ పథకంలో మరో సంస్కరణకు కేంద్రం శ్రీకారం చుట్టింది. ఒకే వ్యక్తికి రెండు జాబ్‌కార్డులు ఉండకుండా చూడటంపై దృష్టి సారించింది. జాబ్‌కార్డుతో ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా దీనికి చెక్ పెట్టేందుకు ఉపక్రమించింది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఆధార్ సీడింగ్ 95 శాతం పూర్తయింది. మిగిలిన 5 శాతం కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. ఇందులో 2 నుంచి 4 శాతం వరకూ రెండేసి జాబ్‌కార్డులున్నట్టు వెలుగులోకి వస్తోంది. జాబ్‌కార్డు పొందిన వారిలో అత్యధికులు వలస వెళ్లిన వారేనని గుర్తించారు. రెండు కార్డులున్న కూలీని పిలిపించి ఏదో ఒకటి ఉంచుకోవాలని చెప్పి, రెండోది తొలగిస్తున్నారు.

రెండు కార్డులు ఎలాగంటే..

ఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేశారు. ఈ క్రమంలో కూలీలకు పని దినాలు కేటాయిస్తున్నారు. ఆ సమయంలో కొందరు రెండేసి జాబ్‌కార్డులు పొందారు. గతంలో జాబ్‌కార్డుల సమాచారం ఆన్‌లైన్‌లో లేకపోవడం, సరైన తనిఖీలు జరగకపోవడంతో అడిగిన వెంటనే రెండో కార్డు కూడా మంజూరు చేశారు. ఉదాహరణకు ఒక కుటుంబంలో తల్లి, తండ్రి, కుమారుడు కలిపి ఒక జాబ్‌కార్డు తీసుకున్నారు. కుమారుడికి పెళ్లయిన తర్వాత కోడలి కోసం కొడుకు, కోడలికి కలిపి కొత్త కార్డు తీసుకున్నారు. అదే సమయంలో పాత జాబ్‌కార్డులో కుమారుడి పేరు తొలగించలేదు. దీంతో అతడి పేరు రెండు కార్డుల్లోనూ ఉంటోంది. ఇటువంటి వాటిని గుర్తించి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు పంపుతున్నారు.

ఆధార్ సీడింగ్ జరిగిందిలా..

జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలవుతున్న మండలాలు	: 18
పంచాయతీలు	: 300
జారీ చేసిన జాబ్‌కార్డులు	: 2,96,000
నమోదైన కూలీలు	: 5,26,000
పనులు చేస్తున్న వారు	: 1,95,000
ఆధార్ సీడింగ్ పూర్తయిన వారు	: 2,51,517
ఇంకా చేయాల్సినవి	: 44,483
రాజమహేంద్రవరం డివిజన్	: 33,283
కొవ్వూరు డివిజన్	: 11,200

వంద శాతం పూర్తి చేస్తాం



జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేస్తున్నాం. రెండు రోజుల్లో మొత్తం పని పూర్తి చేస్తాం. ఆధార్ సీడింగ్ అవకపోతే పనుల కల్పన, బిల్లుల చెల్లింపు కష్టం.ఈ విషయాన్ని గ్రహించి సీడింగ్ చేసుకునేందుకు కూలీలు ముందుకు రావాలి.

– రామ్‌గోపాల్, డ్వామా పీడీ

అక్కడ పాత కార్డు తొలగిస్తున్నారు. మరోపక్క కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు సైతం తమ బంధువుల పేరుతో రెండు కార్డులు మంజూరు చేసుకుని, బిల్లులు జమయినప్పుడు సగం సగం అనే ఒప్పందంపై నిధులు కాజేసేవారని చెబుతున్నారు. ప్రస్తుతం అలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతోంది. ఆధార్ సీడింగ్‌తో ఇటువంటి అవినీతి బాగోతాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి.

సీడింగ్ లేకపోతే పనులకు విఘాతం

జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానానికి గత ఏడాది డిసెంబర్ 31 వరకూ కేంద్రం గడువు ఇచ్చింది. అనంతరం దీనిని ఈ నెలాఖరు వరకూ పెంచింది. ఆలోగా ఈ ప్రక్రియ పూర్తి కాని వారికి మస్టరు వేయడం సాధ్యం కాదు. తద్వారా వారికి పనుల కల్పన కష్టమవుతుంది. దీంతో ఉపాధి సిబ్బంది సీడింగ్‌ను తొలి ప్రాధాన్యంగా తీసుకుని పూర్తి చేసే పనిలో తలమునకలవుతున్నారు. తొలుత ఈ పని వేగంగానే సాగింది. ప్రస్తుతం అన్నీ సమస్యలున్న కార్డులు వస్తుండటంతో జాప్యం జరుగుతోంది. కార్డుల్లోని సమాచారం ఉన్నది ఉన్నట్టు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఒక్క అక్షరం తప్పుగా నమోదైనా అనుసంధానం కావడం లేదు. సమస్య వచ్చిన ప్రతిసారీ ఆయా కూలీలను పిలిచి మరోసారి కార్డులు తనిఖీ చేసి అప్‌లోడ్ చేస్తున్నారు. కొందరు జాబ్‌కార్డులున్నా పనులకు రావడం లేదనే ఉద్దేశంతో అనుసంధానానికి ఆసక్తి చూపడం లేదు. ఇది కూడా ఆధార్ సీడింగ్‌కు ఆటంకంగా మారింది.

ఆధార్ అనుంధానం కాని జాబ్‌కార్డుల వివరాలు

మండలం	ఆధార్ సీడింగ్ కాని కార్డులు
రాజమహేంద్రవరం రూరల్	6,323
కోరుకొండ	6,077
రాజానగరం	4,740
అనపర్తి	4,298
కడియం	3,518
రంగంపేట	2,794
సీతానగరం	2,289
బిక్కవోలు	1,956
గోకవరం	1,288
కొవ్వూరు	3,262
గోపాలపురం	1,519
పెరవలి	1,222
దేవరపల్లి	1,183
ఉండ్రాజవరం	1,129
నిడదవోలు	1,065
నల్లజర్ల	1,056
చాగల్లు	523
తాళ్లపూడి	241

యాప్‌తో యాతన

పనుల కల్పనకు కేంద్రం తీసుకొచ్చిన యాప్‌తో యాతన తప్పడం లేదు. 20 మంది కంటే ఎక్కువగా కూలీలు పనులు కావాలని కోరితే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సాఫ్ట్‌వేర్ (ఎన్ఎంఎంఎస్) యాప్‌లో నమోదు చేయాల్సి ఉండేది. సిబ్బంది సైతం అదే విధానాన్ని అమలు చేసేవారు. తాజాగా ఒక్క కూలీకి పని కల్పించాలన్నా ఈ యాప్‌లో నమోదు చేయాలనే నిబంధన తీసుకువచ్చారు. దీనివల్ల కూలీల హాజరు విషయంలో మరింత పారదర్శకత, పర్యవేక్షణ పకడ్బందీగా ఉంటాయని చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

చిన్నారి వైద్యఖర్చులకు రూ.లక్ష అందజేత



చిన్నారి తల్లిదండ్రులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): శాటిలైట్ సిటీ బి బ్లాక్‌కు చెందిన చిత్తలూరి మాధురి అనే చిన్నారి తక్షణ వైద్యఖర్చుల కోసం రూ.లక్ష చెక్కు అందజేసినట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మాధురి తండ్రి రాజేష్‌కు ఈ మేరకు చెక్కును అందించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జనవరి మూడున రాజమహేంద్రవరంలో పర్యటించినప్పుడు మాధురి తల్లిదండ్రులు ఆయనను కలిసి.. తమ కుమార్తె తలసేమియా వైద్య ఖర్చుల కోసం అర్జీ అందజేశారన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తక్షణ వైద్య ఖర్చుల కోసం రూ.లక్ష అందించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మాధురి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తమ కుమార్తెకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏడాదిగా ప్రతినెలా రూ.10 వేల పింఛన్ అందిస్తోందన్నారు. ప్రతి నెలా రక్తం మార్పిడి కోసం ఆరోగ్యశ్రీ కింద వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం వైద్య పరీక్షల కోసం తక్షణ సహాయంగా సీఎం ఆదేశాలతో కలెక్టర్ రూ.లక్ష అందజేశారని తెలిపారు.

యాజమాన్యం తీరుపై పోరాటం ఉధృతం

- నేటి నుంచి దశల వారీ నిరసన
- కార్మిక సంఘాలతో కార్యాచరణ ప్రణాళిక
- 24 తర్వాత ఏ క్షణమైనా సమ్మెలోకి
- 23న రాజమహేంద్రవరం బంద్
- ఉమ్మడి ఉద్యమ ప్రణాళిక ప్రకటించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



ఎమ్మెల్యే జక్కంపూడి రాజాతో కలిసి సంఘీభావం ప్రకటిస్తున్న కార్మిక సంఘ నేతలు

ప్రకాశం నగర్(రాజమహేంద్రవరం): ఆంధ్రపేపర్ మిల్లు యాజమాన్యం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న మొండి వైఖరి వీడేంత వరకు పోరాటం ఉధృతం చేస్తామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రకటించారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం నివాసంలో మంగళవారం 8 కార్మిక సంఘాలు, ఎమ్మెల్యే సమావేశమయ్యారు. కార్మికుల భవిష్యత్తు దృష్ట్యా చేపట్టాల్సిన పోరాటాలపై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళిక ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. సీనియర్ కార్మికులను బలవంతంగా వీఆర్ఎస్ పేరిట బయటకు పంపి నైపుణ్యం లేని కొత్తవారిని నియమించుకుంటున్నారన్నారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. మిల్లు అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ జయకృష్ణ, కార్మిక సంఘం నేత యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరిస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. మూడేళ్లుగా కార్మిక సంఘాల ఎన్నికలు, వేతన ఒప్పందం జరగలేదన్నారు. గత మూడు నెలలుగా నిరసనలు, సంబంధిత శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పిస్తున్నా యాజమాన్యంలో చలనం లేదన్నారు. కార్మిక సమస్యలపై చర్చించేందుకు మిల్లు వద్దకు వెళితే కనీసం ఒక ప్రజాప్రతినిధికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం దారుణమన్నారు. పేపర్ మిల్లు యాజమాన్యం వైఖరిపై ఇప్పటికే సీఎం కార్యాలయానికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. సమ్మె చేపట్టాలంటే 14 రోజుల ముందుగా యాజమాన్యానికి నోటీసు ఇవ్వాల్సి ఉందని, అందులో భాగంగా అప్పటి వరకు దశల వారీ ఆందోళనలు చేపడతామన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్, ఏఐటీయూసీ నాయకులు రామారావు, ఎల్లా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తు పోరాటం ఇలా..

- 11న: మిల్లు సమీపంలో రిలే నిరాహార దీక్ష
- 12న: రాజకీయ, వివిధ సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం
- 14న: పరంపర–2 జీవోను భోగిమంటల్లో దహనం చేయడం?
- 15న: పేపర్ మిల్లు వద్ద కార్మికులతో మానవహారం
- 18న: పేపర్ మిల్ గేటు వద్ద జనరల్ బాడీ సమావేశం
- 20న: కార్మిక సంఘాలతో భారీ ర్యాలీ
- 23న: రాజమహేంద్రవరం బంద్

రేపు ఆర్టీసీ డిస్పెన్సరీ ప్రారంభం



ప్రారంభోత్సవానికి సిద్ధమైన ఆర్టీసీ డిస్పెన్సరీ

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ డిస్పెన్సరీ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజమహేంద్రవరంలో రూ.46 లక్షల వ్యయంతో దీనిని నిర్మించారు. గురువారం మధ్యాహ్నం రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఈ భవనాన్ని ప్రారంభించనున్నారు. గతేడాది జనవరిలో నిర్మాణం మొదలు పెట్టారు. ఏడాది నాటికి పూర్తి చేసి ఉన్నతాధికారులు ఆదేశాలతో ప్రారంభించేందుకు సిద్ధం చేసినట్లు డీపీటీఓ షర్మిల అశోక్ తెలిపారు. అమలాపురం, రాజమహేంద్రవరం, గోకవరం, రాజోలు, రావులపాలెం, కొవ్వూరు డిపోలకు చెందిన రెగ్యులర్, విశ్రాంత ఉద్యోగులు ఇందులో వైద్యసేవలు పొందవచ్చు. ప్రారంభ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని డీపీటీఓ వివరించారు.

అన్నవరం దేవస్థానానికి ఎస్‌బీఐ బ్యాటరీ కార్ల వితరణ



బ్యాటరీ కారులో ప్రయాణిస్తున్న సీజీఎం నవీన్‌చంద్రఝా, పక్కన ఈఓ సత్యనారాయణ మూర్తి, అధికారులు

అన్నవరం: సామాజిక సేవా కార్యక్రమాలలో తమ బ్యాంకు అగ్రస్థానంలో ఉందని ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ నవీన్‌చంద్ర ఝా చెప్పారు. రూ.26 లక్షల విలువ చేసే రెండు బ్యాటరీ కార్లను మంగళవారం ఆయన అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తికి అందచేశారు. ఈ సందర్భంగా సీజీఎం మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవస్థానాలలో వృద్ధులు, వికలాంగులు, మహిళలను సత్రాల నుంచి స్వామివారి ఆలయానికి చేర్చడానికి ఈ వాహనాలు సమకూర్చుతున్నట్లు తెలిపారు. కారులో 14 మంది సులభంగా ప్రయాణించే వీలుందన్నారు. గతంలో కూడా ఏడుగురు భక్తులు ప్రయాణించేందుకు వీలుగా ఒక బ్యాటరీ కారును దేవస్థానానికి అందచేశామన్నారు. బ్యాంక్ జనరల్ మేనేజర్ కృష్ణ శర్మ మాట్లాడుతూ భక్తులకు సేవా కార్యక్రమాలు అందచేయడంలో ఎస్‌బీఐ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. బ్యాంకు రాజమండ్రి డీజీఎం సురేష్ ప్రభు, తుని రీజినల్ మేనేజర్ సురేష్ బాబు, అన్నవరం బ్రాంచ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ‘జగనన్న తోడు’



జగనన్న తోడు పథకంలో వడ్డీ రాయితీని లబ్ధిదారులకు అందజేస్తున్న సీఎం జగన్ (ఫైల్)

- నేడు బ్యాంకు ఖాతాలలో జమ చేయనున్న సీఎం జగన్
- 28,938 మందికి రూ.71.87 లక్షల వడ్డీ రాయితీ

రాజమహేంద్రవరం రూరల్: చిరు వ్యాపారులు అధికవడ్డీలకు అప్పులు చేసి బాధపడకుండా, వారి జీవన విధానం మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘జగనన్న తోడు’ పథకం అమలు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఆరో విడత వడ్డీ రాయితీ లబ్ధిదారులకు బుధవారం జమ కానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బుధవారం బటన్ నొక్కి ప్రారంభించనున్నారు. దీనివల్ల జిల్లాలో 28,938 మంది లబ్ధిదారులు రూ.71.87 లక్షల లబ్ధిపొందనున్నారు. అత్యధికంగా రాజానగరం నియోజకవర్గంలో 5,644 మంది లబ్ధిదారులకు రూ.16,17,659 వరకు వడ్డీ రాయితీ రూపంలో అందనుంది. ఈ పథకంలో రుణం పొంది చిరు వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. తోపుడు బండ్ల కార్మికులు, ఇళ్ల వద్ద చిన్నచిన్న కిరాణా దుకాణాలు, పండ్ల దుకాణాలు, కూరగాయల వ్యాపారులు, సైకిళ్ల మీద వ్యాపారాలు చేసుకునే వారు, చిన్నగా ఆహార పదార్థాలు తయారు చేసుకునేవారికి జగనన్న తోడు కింద రూ.పది వేల వరకు రుణం ఇస్తున్నారు. రుణం పొందిన వారు నెలకు అసలు, వడ్డీ రూపంలో రూ.900 చొప్పున ఏడాదికి రూ.10,800 వరకు చెల్లిస్తున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించన వారికి వడ్డీ మొత్తం రాయితీ రూపంలో తిరిగి ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లిస్తోంది. అసలు రూ.పది వేలు పోను, మిగిలిన రూ.800లను వడ్డీని ఏడాదికి రెండు దఫాలుగా రూ.400 చొప్పున వ్యక్తిగత ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీని వల్ల చిరు వ్యాపారులు వడ్డీ లేకుండానే రుణం పొందినట్టవుతోంది.



చిరు వ్యాపారులకు మేలు



జగనన్నతోడు పథకం చిరు వ్యాపారులకు మేలు చేస్తోంది. జగనన్న తోడులో రుణం పొంది క్రమం తప్పకుండా అసలు, వడ్డీలు వాయిదాల రూపంలో సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రాయితీ తిరిగి చెల్లిస్తున్నాం. దీని వల్ల చిరు వ్యాపారులపై వడ్డీ భారం పడడం లేదు.

– సిరిపురపు సుభాషిణి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, వైఎస్సార్‌క్రాంతి పథం

నియోజకవర్గాల వారీగా పథకం లబ్ధి ఇలా..

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య	వడ్డీ రాయితీ (రూ.లో)
కొవ్వూరు	3,172	8,00,713
గోపాలపురం	2,368	4,63,942
నిడదవోలు	5,567	14,71,535
రాజమహేంద్రవరం రూరల్	2,445	5,36,452
రాజమహేంద్రవరం అర్బన్	6,334	14,69,424
అనపర్తి	2,749	7,04,157
రాజానగరం	5,644	16,17,659
జగ్గంపేట (గోకవరం మండలం)	659	1,23,729

క్లుప్తంగా

భారీగా మద్యం ధ్వంసం



ధ్వంసం చేయడానికి మద్యం బాటిళ్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

రావులపాలెం: వివిధ కేసులలో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని స్థానిక గౌతమీ గోదావరి గట్టున పోలీసులు, ఎక్సైజ్ అధికారులు మంగళవారం ధ్వంసం చేశారు. జిల్లా ఎస్పీ, ఎస్ఈబీ రాజమహేంద్రవరం అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యాన రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో 2017 నుంచి 2021 వరకూ వివిధ కేసులలో 885 మద్యం సీసాలను, సుమారు రూ.6.50 లక్షల విలువైన 373 లీటర్ల డ్యూటీ పెయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని ధ్వంసం చేశారు. ఈ వివరాలను సీఐ ఎన్.రజనీకుమార్, ఎస్సైలు వెంకటరమణ, సుధాకర్ తెలిపారు.

పందెంకోళ్లు స్వాధీనం

రాజోలు: వ్యాన్‌లో తరలిస్తున్న పందెంకోళ్లను రాజోలు పోలీసులు మంగళవారం తాటిపాకలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై కృష్ణమాచారి ఆధ్వర్యాన పోలీసులు తాటిపాక సెంటర్‌లో వాహన తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మలికిపురం మండలం శంకరగుప్తం నుంచి కాకినాడకు 47 పందెంకోళ్లు తరలిస్తున్న వ్యాన్‌ను గుర్తించారు. అందులోని పందెంకోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోళ్లు తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యంతో అధికారులు

పిఠాపురం: స్థానిక బైపాస్ రోడ్డులో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న మినీ వ్యాన్‌ను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి కథనం ప్రకారం శంఖవరం మండలం కత్తిపూడి నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్టు అధికారులకు పక్కా సమాచారం అందింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారుల బృందం మంగళవారం పిఠాపురంలో తనిఖీలు చేపట్టింది. ఒక మినీ వ్యాన్‌లో రూ.5.98 లక్షల విలువైన 39.10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. వ్యాన్‌ను, అందులోని రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్ డ్రైవర్ బొజ్జా వీర లక్ష్మణమూర్తిని అదుపులోకి తీసుకుని, పిఠాపురం పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ కూడా పాల్గొన్నారు.

సర్కారు వారి పెళ్లికానుక

- పేదల వివాహానికి నగదు సాయం
- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా అమలుకు చర్యలు
- ఇప్పటికే వచ్చిన అర్జీల పరిశీలన



రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మరో హామీ అమలుకు శ్రీకారం చుట్టింది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన యువతుల వివాహాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా ద్వారా ఆర్థిక సహాయం అందజేసేందుకు చర్యలు చేపట్టింది. వైఎస్సార్ కల్యాణమస్తు పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన, ఇతర నిర్మాణ రంగాల్లో నమోదైన కార్మికులకు లబ్ధి చేకూరుస్తారు. షాదీతోఫా పథకం ద్వారా ముస్లిం మైనార్టీలకు మేలు కలుగుతుంది. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్ 1 తేదీ నుంచి గ్రామ సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. ఇప్పటి వరకూ జిల్లాలో 32 దరఖాస్తులు అందాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వాటిని పరిశీలిస్తున్నారు. అన్ని స్థాయిల్లోనూ సమగ్ర పరిశీలన పూర్తయ్యాక అధికారిక ఆమోదం కోసం కలెక్టర్‌కు ఈ దరఖాస్తులు పంపుతారు.

దరఖాస్తు చేయడం ఇలా..

వివాహం జరిగిన 60 రోజుల్లోగా ఆయా గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలి. తొలుత సచివాలయాల ద్వారా వివాహ సర్టిఫికెట్ పొందాలి. అనంతరం నిబంధనల మేరకు వివాహ ధ్రువపత్రాలను దరఖాస్తులో పొందుపర్చాలి. ముఖ్యంగా పెళ్లిపత్రిక, పెళ్లి సమయంలో తీయించిన ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు పెళ్లికుమార్తె బ్యాంకు ఖాతా జిరాక్స్ సమర్పించాలి. వధూవరుల చదువుకు సంబంధించి పదో తరగతి ఉత్తీర్ణత సర్టిఫికెట్ల జిరాక్సు కూడా దరఖాస్తుకు జత చేయాలి. భవన నిర్మాణ కార్మికులు సభ్యత్వ ధ్రువీకరణ పత్రం కూడా సమర్పించాలి. ఈ పథకాలపై వైఎస్సార్ క్రాంతిపథం సిబ్బంది తమ పరిధిలోని సంఘాల సభ్యుల ద్వారా ఇప్పటికే ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

అర్హతలు ఇవే...

- వివాహమయ్యేనాటికి వరుడికి 21, వధువుకు 18 సంవత్సరాలు నిండి ఉండాలి.
- భర్త చనిపోయిన స్త్రీ రెండో పెళ్లి చేసుకున్నా అర్హురాలే.
- వధూవరులు కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- కుటుంబ ఆదాయం నెలకు పల్లెల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలకు మించకూడదు.
- భూమి పల్లం 3 ఎకరాలు, మెట్ట అయితే 10 ఎకరాలు లేదా రెండూ కలిపి 10 ఎకరాలు మించకూడదు.
- కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగి లేదా పెన్షన్‌దారు అయ్యి ఉండకూడదు.
- పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు మినహాయింపు ఉంది.
- కారు ఉండరాదు. ఆటో, ట్రాక్టర్, ట్యాక్సీకి మినహాయింపు ఉంది.
- కుటుంబం నెలవారీ విద్యుత్ వాడకం 300 యూనిట్లు మించరాదు.
- మున్సిపల్ ప్రాంతంలో 1000 ఎస్ఎఫ్‌టీకి మించి నివాస స్థలం ఉండరాదు.

సద్వినియోగం చేసుకోవాలి



పేదల వివాహాలకు ఆర్థిక సాయం అందజేయడానికి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సామాజికవర్గాల వారీగా ఆర్థిక సాయం అందజేస్తుంది. కులాంతర వివాహాల ప్రోత్సాహానికి కూడా అదనపు ఆర్థిక సాయం అందుతుంది.

– సిరిపురపు సుభాషిణి, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథం, తూర్పు గోదావరి జిల్లా

కల్యాణ కానుక అందిస్తారిలా..

కేటగిరీ	ఆర్థిక సాయం (రూ.లలో)
ఎస్సీ	1,00,000
కులాంతర వివాహం	1,20,000
ఎస్టీ	1,00,000
బీసీ	50,000
బీసీ కులాంతర	75,000
దివ్యాంగ	1,50,000
భవన నిర్మాణ కార్మికులు	40,000

ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధం



దగ్ధమవుతున్న ఎలక్ట్రికల్ స్కూటీ

పి.గన్నవరం: నాగుల్లంక శివారు గుడ్డాయలంకలో ఎలక్ట్రికల్ స్కూటీ దగ్ధమైంది. గ్రామానికి చెందిన యువకుడు గంటా తరుణ్ 2021లో తన సోదరి పేరిట ఒకినావా కంపెనీకి చెందిన ఎలక్ట్రికల్ స్కూటీ కొనుగోలు చేశాడు. ఆ వాహనంపై మంగళవారం ఉదయం తరుణ్ జగ్గన్నపేట సెంటర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి వచ్చాడు. కొద్దిసేపటి తర్వాత మళ్లీ బయటకు వెళ్లేందుకు స్కూటీ వద్దకు వచ్చి, సెల్ఫ్ బటన్ ఆన్ చేశాడు. వెంటనే డిక్కీలో ఉన్న బ్యాటరీ నుంచి పొగలు వచ్చి క్షణాల్లో స్కూటీ దగ్ధమైందని తరుణ్ విలేకర్లకు చెప్పాడు. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో పక్కనే కారు ఉంది. దానిని హుటాహుటిన పక్కకు తరలించారు. స్కూటీ దగ్ధం కావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

రేపటి నుంచి సంక్రాంతి సెలవులు

19న పాఠశాలలు పునఃప్రారంభం

రాయవరం: పాఠశాలలకు ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకూ సంక్రాంతి సెలవులు ప్రకటించారు. తొలుత 11 నుంచి 16వ తేదీ వరకూ సెలవుల ప్రకటించగా.. వివిధ ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం.. ఈ నెల 12 నుంచి 18వ తేదీ వరకూ సెలవుల షెడ్యూల్‌ను సవరించింది. అయితే 18వ తేదీన ప్రకటించిన అదనపు సెలవుకు బదులు భవిష్యత్తులో ఏదో ఒక సెలవు దినం నాడు పని చేయాల్సి ఉంటుందని పేర్కొంది. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు ఫిబ్రవరి 12న పని చేయాల్సి ఉంటుందని సంబంధిత డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి సెలవులు ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలలకూ వర్తిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

ముగిసిన ఎస్ఏ–1 పరీక్షలు

సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 (ఎస్ఏ–1) పరీక్షలు మంగళవారం ముగిశాయి. ఈ నెల 2 నుంచి ఓరియెంటల్ లాంగ్వేజ్ పేపర్–1తో ఈ పరీక్షలు ప్రారంభించారు. 8వ తరగతికి సైన్స్, గణితం ట్యాబ్ కంటెంట్ విధానంతో నిర్వహించారు. మిగిలిన తరగతులకు డీసీఈబీ విధానానికి అనుగుణంగానే పరీక్షలు నిర్వహించారు. చివరిగా 6, 7, 9, 10 తరగతులకు సోషల్, 8వ తరగతికి గణితం పరీక్షలు జరిగాయి. ప్రాథమిక పాఠశాలల్లో ఈ నెల 4న ప్రారంభమైన పరీక్షలు ఈ నెల 7వ తేదీతో ముగిశాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ యాజమాన్యాల్లో 7,74,752 మంది విద్యార్థులున్నారు. ప్రాథమిక స్థాయిలో 1–5 తరగతి వరకూ 3,79,128 మంది, ఉన్నత పాఠశాలల స్థాయిలో ఆరు నుంచి పదో తరగతి వరకూ 3,68,624 మంది పరీక్షలు రాశారు. వీరందరికీ జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు (డీసీఈబీ) ద్వారానే పరీక్షలు నిర్వహించారు.

టెన్త్ పరీక్షలపై నేడు వర్చువల్ సమీక్ష

రాయవరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు ముందస్తు సన్నాహక చర్యలపై ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి బుధవారం వర్చువల్ సమీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకూ ఈ సమీక్ష జరుగుతుంది. సిస్కో వెబెక్స్ సమావేశానికి ప్రధానోపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల పరిధిలోని ప్రధానోపాధ్యాయులకు మంగళవారం ఆదేశాలు వచ్చాయి. ప్రతి ఒక్కరూ వెబెక్స్ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ (డీసీఈబీ) కార్యదర్శి ఎం.వెంకట్రావు తెలిపారు.

నేటి నుంచి ఎడిట్ ఆప్షన్

పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఆన్‌లైన్ సమాచారంలో బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకూ ఎడిట్ ఆప్షన్ సదుపాయాన్ని ప్రభుత్వ పరీక్షల విభాగం కల్పించింది. తద్వారా ఇప్పటికే ఆన్‌లైన్ నామినల్ రోల్స్ సబ్‌మిట్ చేసిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల సమాచారాన్ని పునఃపరిశీలించి, తప్పులు దొర్లితే సరి చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. ఇదే చివరి అవకాశంగా భావించి, నామినల్ రోల్స్ సమాచారాన్ని సరిచేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లా విద్యాశాఖాధికారులు ఎస్‌వీ రవిసాగర్, ఎస్ఏ అబ్రహం తెలిపారు.

ఖోఖో సందడి

- ఉత్సాహంగా సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టోర్నమెంట్ ప్రారంభం
- 78 వర్సిటీలు.. 1,200 మంది క్రీడాకారులు
- జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో కోలాహలం



ఖోఖో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే క్రీడా ప్రాంగణంలో క్రీడా సందడి నెలకొంది. అసోషియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ సహకారంతో నాలుగు రోజుల పాటు నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్ మంగళవారం ప్రారంభమైంది. మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 78 యూనివర్సిటీల నుంచి 1,200 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. క్రీడా మైదానంలో నాలుగుచోట్ల పోటీలు ప్రారంభించారు. తొలి రోజు 30 టీములకు పోటీలు నిర్వహించగా, వీటిలో ప్రతిభ చూపిన వారిని తదుపరి రౌండుకు ఎంపిక చేశారు. రాత్రి 8 గంటల వరకూ పోటీలు నిర్వహించేందుకు వీలుగా ఫ్లడ్ లైట్లు, సందర్శకులకు ప్రత్యేక గ్యాలరీ, ఫస్ట్ ఎయిడ్ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్రీడాకారులతో పాటు సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్‌కుమార్ పర్యవేక్షించారు.

రెండేళ్ల తరువాత..



కోవిడ్ కారణంగా రెండేళ్లు క్రీడా పోటీలు నిర్వహించలేదు. మళ్లీ ఇప్పుడు యూనివర్సిటీ స్థాయిలో ఈ పోటీలు నిర్వహించడం, ఇందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. మా యూనివర్సిటీ నుండి 14 మంది ఒక జట్టుగా ఈ క్రీడల్లో పాల్గొంటున్నాం.

– నరేన్, మహాత్మా యూనివర్సిటీ, కొట్టాయం, కేరళ

సంతోషంగా ఉంది



వివిధ రాష్ట్రాల విద్యార్థులతో కలిసి పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు సక్రమంగా కల్పించారు. వివిధ యూనివర్సిటీ విద్యార్థుల మధ్య స్నేహ సౌభ్రాతృత్వం పెంపొందింపజేయడానికి ఇటువంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తాయి.

– ఎం.ప్రశాంత్, ఉస్మానియా యూనివర్సిటీ, హైదరాబాద్

ఉత్సాహం కలిగించాయి



ఈ పోటీలు చాలా ఉత్సాహం కలిగించాయి. పోటీలకు వేదికగా నిలిచిన జేఎన్‌టీయూకేకి మా టీమ్ తరఫున కృతజ్ఞతలు. కాకినాడ సముద్ర తీర ప్రాంతంలో పోటీల్లో పాల్గొనడం మధురానుభూతిగా నిలుస్తుంది.

– పవన్‌కుమార్ నాయక్, జేఎన్‌టీయూ, అనంతపురం

పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటా

- నాపై భర్త, అతడి ప్రియురాలి హత్యాయత్నం
- ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు
- న్యాయం చేయాలి
- వాట్సాప్‌లో మహిళ వీడియో హల్‌చల్
- హడావుడిగా పోలీసుల ఎఫ్ఐఆర్



విలేకర్లతో మాట్లాడుతున్న లోవలక్ష్మి

కాజులూరు: తనపై భర్త, అతడి ప్రియురాలు హత్యాయత్నానికి పాల్పడ్డారని.. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా పోలీసులు నెల రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని.. ఇకనైనా న్యాయం చేయకపోతే పోలీస్ స్టేషన్ ఎదుటే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఓ మహిళ వీడియో స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడం కలకలం రేపింది. మీడియాకు ఆమె మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. కాజులూరు శివారు చాకిరేవు మెరకకు చెందిన అనసూరి లోవలక్ష్మికి పదేళ్ల కిందట కె.గంగవరం మండలం శివల గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో వివాహమైంది. అయితే అతడు గ్రామంలోని మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీనిపై లోవలక్ష్మి నిలదీసింది. ఈ నేపథ్యంలో ఒక రోజు అర్ధరాత్రి భర్త, అతడి ప్రియురాలు కలిసి లోవలక్ష్మిపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. వారి నుంచి తప్పించుకున్న లోవలక్ష్మి కాజులూరులోని పుట్టింటికి వచ్చేసింది. తనపై హత్యాయత్నం జరిగిందని, తనకు న్యాయం చేయాలని గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారు పట్టించుకోకపోవడంతో కాకినాడ జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబును కలిసి పరిస్థితి వివరించింది. ఎస్పీ ఆదేశాల మేరకు గొల్లపాలెం పోలీసులు లోవలక్ష్మి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. అయితే ఎటువంటి కేసూ నమోదు చేయలేదు. ఈ నేపథ్యంలో తనను నెల రోజులుగా అర్ధరాత్రి వరకూ ముద్దాయి మాదిరిగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని, ఇకనైనా తనకు న్యాయం చేయకపోతే గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎదుట ఆత్మహత్య చేసుకోవటం తప్ప మరో దారి లేదని లోవలక్ష్మి పేర్కొంది. ఆమె ఈవిధంగా మాట్లాడుతున్న వీడియో వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తున్న నేపథ్యంలో పోలీసులు మంగళవారం హడావుడిగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

కౌన్సెలింగ్ వల్లనే జాప్యం

ఇది భార్యాభర్తలకు సంబంధించిన కేసు. ఇద్దరికీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. అందువల్లనే కేసు నమోదు ఆలస్యమైంది. రెండుసార్లు కౌన్సెలింగ్ చేసినా వారు అంగీకరించలేదు. దీంతో మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశాం.

– ఎం.తులసీరామ్, ఎస్సై, గొల్లపాలెం

ఉప్పుటేరులో పడి వ్యక్తి మృతి

కొత్తపల్లి: ప్రమాదవశాత్తూ ఉప్పుటేరులో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన గంగిరి కొండయ్య (52) స్థానిక ఉప్పుటేరులో సోమవారం సాయంత్రం పీతలు పట్టడానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. అతడి మృతదేహం మంగళవారం ఉప్పుటేరులో లభ్యమైంది. కొండయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్సై రామలింగేశ్వరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- ఆరుగురికి గాయాలు
- అందరూ కాకినాడకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థులు



108 అంబులెన్సులో క్షతగాత్రులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు శివారున ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఓ కారు డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన ఆరుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ ఎస్సై ఎ.బాలాజీ కథనం ప్రకారం.. కాకినాడలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులు స్నేహితుడి పుట్టిన రోజు వేడుకకు కారులో విశాఖపట్నం వెళుతున్నారు. తుని మండలం చేపూరు దాటిన తర్వాత ముందు వెళుతున్న లారీని తప్పించబోయారు. ఈ క్రమంలో వారి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కాకినాడకు చెందిన ఎండీ ఆలీషా, మేడిశెట్టి సాయిప్రకాష్, కాయల హరివికాస్, కాయల సాయిప్రవీణ్, కుందా దిలీప్ (రాజమహేంద్రవరం), గునుపూడి దిలీప్ (తాడేపల్లిగూడెం) గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు వారిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

హక్కులు, బాధ్యతలు రెండు కళ్లు



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ కార్యవర్గం

కడియం: హక్కులు, బాధ్యతలు యూటీఎఫ్‌కి రెండు కళ్లని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్. అరుణ కుమారి అన్నారు. కడియం మండలం యూటీఎఫ్ నూతన కౌన్సిల్ ఎన్నికను మంగళవారం వేమగిరి హైస్కూల్ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కె.భీమయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బీవీవీ ఆనంద్ కుమార్, ఆకుల వీర్రాజు, ఉపాధ్యక్షులుగా అల్లాడ బాలాజీ, ఎం.వనిత, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి షరీఫ్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

భోగి పిడకలు ఫర్ సేల్



అమ్మకానికి సిద్ధం చేసిన భోగి పిడకల దండలు

రాజమహేంద్రవరం రూరల్: భోగి పండగ వస్తుందంటే గతంలో నెలరోజుల ముందుగానే సందడి మొదలయ్యేది. ఆవుపేడను సేకరించి పిడకలు తయారు చేసి, దండలుగా గుచ్చేవారు. కానీ నేటి స్పీడ్ యుగంలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. అందుకే మార్కెట్‌లోనూ, ఆన్‌లైన్‌లోనూ భోగిపిడకలు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక వీఎల్ పురంలో పడమటి శ్రీను అనే వ్యాపారి భోగిపిడకల దండలను విక్రయిస్తున్నాడు. ఒక్కో దండ రూ.50 వరకూ అమ్ముతున్నట్టు తెలిపాడు.

సంక్షేమ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ హాస్టళ్లలో వసతులు కరువయ్యాయని, తక్షణమే అధికారులు చర్యలు చేపట్టాలని బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. రెండు రోజులుగా జిల్లాలోని అన్ని వసతి గృహాలను సందర్శించి సమస్యలు పరిశీలించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,109 ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఖాళీగా ఉన్న 430 వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, జోనల్ కన్వీనర్ కురగంటి సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల రామకృష్ణ, రూరల్ మండల అధ్యక్షుడు యానాపు ఏసు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మేటివ్ పరీక్షలు

ప్రకాశం నగర్: వారం రోజులుగా ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న సమ్మేటివ్ -1 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. మూల్యాంకనం పూర్తి చేసి, మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏలు

రాజమహేంద్రవరం రూరల్: వరిపంటను ఆశించే తెగుళ్లు, నివారణ చర్యలపై మంగళవారం రాజవోలులో సమావేశం నిర్వహించారు. జిల్లా రిసోర్స్ సెంటర్ (డీఆర్‌సీ) ఏడీఏలు ఏవీఎస్ రంగారావు, జ్యోతిర్మయి మాట్లాడుతూ ఎరువులు, పురుగుమందులు, వాటి మోతాదు గురించి రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ దుర్గబాబు, వీహెచ్ఏ పుష్ప, రైతులు పాల్గొన్నారు.

సారాతో ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్‌స్టేషన్ పరిధిలోని గాదిరెడ్డి నగర్‌లో మంగళవారం 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వరదా నాగమణి, వరదా రవిశంకర్‌ను అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. అలాగే బాబా నగర్‌కు చెందిన వనుము లోవరాజుపై కలెక్టర్ ఉత్తర్వులు మేరకు పీడీ యాక్ట్ అమలుపరిచి సెంట్రల్ జైలుకు తరలించామన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

కడియం: సంక్రాంతి పేరుతో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎం.సుజాత హెచ్చరించారు. వేమగిరితోటలో మంగళవారం పోలీసు, రెవెన్యూ అధికారులు అవగాహనా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సుజాత మాట్లాడుతూ సంక్రాంతి పండగను సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలన్నారు. ఎస్సై శ్రీనివాసరావు, వెటర్నరీ వైద్యులు కిరణ్, హెచ్‌సీ శ్రీనివాసరావు, సచివాలయ కార్యదర్శి సుదీప్తి, మహిళా పోలీసు స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా రాజధానిగా రాజమహేంద్రవరం

- శాప్‌కు ఎంపికైన ఎస్‌కేవీటీ ఫుట్‌బాల్ మైదానం
- త్వరలోనే అందుబాటులోకి..



ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలోని ఫుట్‌బాల్ మైదానం

ప్రకాశం నగర్: సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరం త్వరలోనే క్రీడా రాజధానిగా మారనుంది. ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికారసంస్థ (శాప్) రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాల ఆవరణలోని క్రీడాప్రాంగణాన్ని ఫుట్‌బాల్ మైదానంగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే విడుదల కానున్నాయి. నగరంలోని ప్రధానంగా ఆర్ట్స్ కళాశాల, ఎస్‌కేవీటీ, నాగుల చెరువు బజారు (స్టేడియం) మైదానాలు క్రీడాకారులకు అందుబాటులో ఉన్నాయి. వీటిలో క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ వంటి క్రీడలకు సంబంధించిన పోటీలు, ఎంపికలు నిర్వహిస్తూ ఉంటారు. కాగా.. కొత్త జిల్లాల ఏర్పాటుతో తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలోని మైదానాన్ని ఫుట్‌బాల్ క్రీడాప్రాంగణంగా శాప్ గుర్తించడంతో క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 50 నుంచి 60 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు రాజమహేంద్రవరంలో ఉన్నారు. ఆ క్రీడ కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం క్రీడా మైదానాన్ని గుర్తించడం శుభ పరిణామం అని కొనియాడుతున్నారు.

కోచ్ నియామకం, సౌకర్యాల కల్పన

ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)కు ఎంపికైన ఫుట్‌బాల్ మైదానంలో క్రీడాకారుల శిక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక కోచ్‌ను నియమిస్తుంది. క్రీడాకారులకు అవసరమైన సామగ్రిని అందజేయడంతో పాటు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు జరిగినప్పుడు వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారుల కోసం సౌకర్యాలు కూడా కల్పిస్తారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల పరిధిలో జరిగే ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు రాణించేందుకు అవసరమైన శిక్షణను ఇస్తారు. దీనిద్వారా క్రీడాకారులు ఆటలో మరిన్ని మెలకువలు నేర్చుకుని, ఆటలో పరిణితి చెందే అవకాశం ఉంది.

శిక్షణకు మంచి వేదిక

ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలోని మైదానం ఫుట్‌బాల్ క్రీడా మైదానంగా శాప్ ఎంపిక చేయడం శుభపరిణామం. క్రీడాకారుల శిక్షణకు ఒక మంచి వేదిక త్వరలోనే ఏర్పాటు కానుంది. క్రీడాకారులు ఆటల్లో మరింత రాణించే అవకాశం ఉంటుంది. శిక్షణతో పాటు సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– నాగేంద్ర కిశోర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి

స్వచ్ఛ నగరం సాకారానికి కృషి



గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛ రాజమహేంద్రవరం సాకారానికి సమష్టిగా కృషి చేద్దామని ఎంపీ మార్గాని భరత్ రామ్ పిలుపు నిచ్చారు. 36వ డివిజన్‌లోని తుమ్మలావ సాయిబాబా గుడి నుంచి మంగళవారం గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ పారిశుధ్య సమస్యలను తన దృష్టికి వస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైనేజీలో పూడిక పేరుకుపోవడంతో నీరు నిలిచిపోయి దుర్వాసనతో పాటు దోమలు ఎక్కువై ఇబ్బంది పడుతున్నామని స్థానికులు తెలిపారు. ఎంపీ వెంటనే మున్సిపల్ ఎస్ఈ పాండురంగారావుకు మురుగునీరు పారేలా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటాన్ని గమనించిన ఎంపీ.. ఎలక్ట్రికల్ ఏఈకి ఆ తీగలను సరిచేయించాలని ఆదేశించారు. కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని ఎంహెచ్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, సప్పా ఆదినారాయణ, పాలిక శ్రీను, నందం స్వామి, సీరపు గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పాములమెట్ట కాలనీలో తాటాకిళ్లు దగ్ధం



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సతీష్‌చంద్ర స్టాలిన్

కడియం: జేగురుపాడు పంచాయతీ పరిధి పాములమెట్ట కాలనీలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకిళ్ల దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో చలంశెట్టి నరసింహస్వామి, పెనుమాటి లక్ష్మణుడు, కుంచాల లోకేష్ బాబుకు చెందిన కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్టు బాధితులు చెబుతున్నారు. నిద్రలో ఉండగా మంటలు చెలరేగాయని, అగ్గివేడి తగలడంతో భయంతో బయటకు పరుగులు తీశామన్నారు. స్థానికులు అప్రమత్తమై మంటలను పూర్తిగా ఆర్పివేశారు. సుమారు రూ.2.50 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఇటుక బట్టీల్లో పనులు చేసుకుని కూడబెట్టుకున్నదంతా బుగ్గిపాలై, కట్టుబట్టలతో మిగిలామని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ప్రమాదంలో ఒక వృద్ధుడి తలకు కాలిన గాయమైంది. అతడిని అంబులెన్స్‌లో కడియం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

బాధితులను ఆదుకుంటాం

ప్రమాదం విషయం తెలిసిన వెంటనే వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ బాధితులను పరామర్శించారు. వారికి ఆహారం, తాత్కాలిక వసతి సదుపాయాలు కల్పించారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణం సాయం అందించాల్సిందిగా కోరారు. ప్రభుత్వం ద్వారా బాధితులకు సాయం అందిస్తామన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి శివాజీ, పార్టీ నాయకులు నాగిరెడ్డి మోహన్, బళ్ల అన్నవరం, సాకా కిరణ్, మోటుక మునియ్య, గోపి, దుర్గాప్రసాద్, లక్ష్మణరావు, సత్యనారాయణ, కుమార్ ఉన్నారు.

బాధితులను ఆదుకుంటాం



ప్రమాద ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: కడియపులంక పంచాయతీ పరిధిలోని దోసాలమ్మ కాలనీలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని వైఎస్సార్‌సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన సుబ్రహ్మణ్యం, బుల్లెమ్మల కుటుంబాలను నాగేశ్వర్ మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు నగదు, వంట సామగ్రి, నిత్యావసరాలను అందజేశారు. ప్రభుత్వ పరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, మండల బూత్ కమిటీ కన్వీనర్ తాడాల చక్రవర్తి, పార్టీ నాయకులు ఆరేటి వెంకట్రావు, రమణ ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న జాంపేట బ్యాంక్ చైర్మన్ జయకుమార్

ధవళేశ్వరం: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ది జాంపేట కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయకుమార్ అన్నారు. ధవళేశ్వరం బ్రాంచ్ 13వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బ్యాంక్ చైర్మన్ బొమ్మన జయకుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు తొమ్మిది బ్రాంచీల్లో రూ.600 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. వైస్ చైర్మన్ జామిశెట్టి గాంధీ, డైరెక్టర్లు లక్ష్మణరావు, అమర్నాథ్, పార్వతి సుందరి, కొమ్మన వెంకటేశ్వరరావు, సేపేని రమణమ్మ, రామచంద్రరావు, పల్లా వెంకటేశ్వరరావు, సెక్రటరీ విజయ ప్రతాప్ పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- ఎంపీ భరత్ రామ్
- ఉత్సాహంగా గడప గడపకూ



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 47వ డివిజన్ క్వారీ మార్కెట్ సెంటర్ సిద్ధార్థ నగర్‌లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చోడిశెట్టి సత్యవాణి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు సిద్ధార్థ్ నగర్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో పిల్లలకు చదువు సక్రమంగా చెప్పడం లేదని తెలిపారు. దీనిపై స్పందించిన ఎంపీ భరత్ రామ్ వెంటనే డీఈఓ అబ్రహంకు ఫోన్ చేశారు. ఆ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల విద్యా బోధన, పాఠశాల నిర్వహణ తీరుతెన్నులు గమనించాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం ప్రైమరీ స్కూల్‌గా ఉన్న పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే చర్యలు చేపడతానని స్థానికులకు హామీ ఇచ్చారు. పిల్లల చదువు ఈ రోజుల్లో బరువు కాదని, మేనమామ మాదిరిగా జగనన్న విద్యార్థుల భవిష్యత్తు కోసం ఖర్చు చేస్తున్నారన్నారు. విద్యుత్, డ్రైనేజీ తదితర సమస్యలను ప్రజలు ఎంపీ దృష్టికి తీసుకురావడంతో వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, గుడాల ఆదిలక్ష్మి, తిరగాటి దుర్గ, గుడాల ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాగ్‌లో సెల్‌ఫోన్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఆటోలో వెళ్తుండగా తన భార్య బ్యాగ్‌లోని సెల్‌ఫోన్ చోరీకి గురైందని కపిలేశ్వరపురం మండలం పడమరఖండ్రిగ గ్రామానికి చెందిన నెల్లి రాజ్‌కుమార్ మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆటో డ్రైవర్ అయిన రాజ్‌కుమార్ తన భార్యను ఆటోలో సోమవారం దానవాయిపేటలో చెస్ట్ హాస్పిటల్ తీసుకువచ్చాడు. మధ్యాహ్నం భార్యను తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గం మధ్యలో ముగ్గురు మహిళలు ఎక్కి తర్వాత దిగిపోయారు. అనంతరం ఐఎల్‌టీడీ సెంటర్‌లో బ్యాగ్‌ను చూసుకోగా అందులోని రూ.14 వేల సెల్‌ఫోన్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొలంబడిపై అవగాహన ర్యాలీ



మురమండలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, రైతులు

కడియం: మండలంలోని మురమండలో మంగళవారం పొలంబడి కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సాగులో వినూత్న విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతుసాధికార సంస్థ, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు రామకృష్ణ, లక్ష్మణ్, భీష్మాంబ, స్థానిక నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పొలంబడిలో రైతులకు పలు విధానాలను వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

సీటీఆర్ఐ: వినియోగదారుల చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. న్యాయసేవాధికారి సంస్థ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల చట్టం, తగాదాల పరిష్కారానికి సంబంధించి న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులు ఏ వస్తువు కొనుగోలు చేసినా తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. అప్పుడే వారికి ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుందన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, అనంతరావు, రాజేశ్వరరావు, శామ్యూల్ రాజ్, రుక్కయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న సభ్యులు

ప్రకాశం నగర్: కేరళలో డిసెంబర్ 26 నుంచి జనవరి 8 వరకు జరిగిన జాతీయ సంతోష్ ట్రోఫీ అంతర రాష్ట్ర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు జిల్లా ఫుట్‌బాల్ క్రీడాకారులు పి.సాయి సంపత్ రాజ్, కె.అనిల్ కుమార్, వలవల భాస్కర్ ప్రాతినిథ్యం వహించారు. వారిని మంగళవారం జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేవీటీ కళాశాల ప్రాంగణంలో సన్మానించారు. గౌరవ కార్యదర్శి సుంకర నాగేంద్ర కిషోర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎబెల్ రాజబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా జక్కంపూడి ఫౌండేషన్



తిరుపతికి బయలు దేరిన మోకాలు మార్పిడి బాధితులు

రాజమహేంద్రవరం సిటీ: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ నిలుస్తుందని వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్ సెంటర్ నిర్వాహకులు, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. రాజానగరం నియోజకవర్గానికి చెందిన ఎనిమిది మందిని మంగళవారం మోకాలు మార్పిడి చికిత్స కోసం తిరుపతిలోని బర్డ్స్ హాస్పిటల్‌కు పంపించారు. వారికి ఫౌండేషన్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నామన్నారు.

కార్తికేయ నగర్‌లో చోరీ

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట కార్తికేయ నగర్‌కు చెందిన రైల్వే ఉద్యోగి కె.వెంకటేశం కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాకుళం వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూడగా బీరువాలోని 50 గ్రాముల బంగారు ఆభరణాలు, 80 గ్రాముల వెండి వస్తువులు, కొంత నగదు మాయమైంది. ఈ మేరకు బొమ్మూరు పోలీసులకు వెంకటేశం ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్, ఎస్సై శివాజీ ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్‌టీమ్ వేలిముద్రలను సేకరించింది.

మోసం చేశారంటూ ఫిర్యాదు

రాజమహేంద్రవరం రూరల్: నాళం భీమరాజు వీధికి చెందిన వెలుగూరి వినాయక రత్నారావు ఆన్‌లైన్‌లో ట్రేడ్ ఇండియా డాట్ కామ్ ద్వారా సరకుల కొని తన షాపులో విక్రయిస్తుంటాడు. ఈ నేపథ్యంలో గతనెల 8వ తేదీ నుంచి వాట్సాప్‌లో ముంబైకి చెందిన హరికాంత్ ట్రేడింగ్ లిమిటెడ్‌తో చర్చలు జరిపాడు. గత నెల 26న వారివద్ద సరకు బుక్ చేసుకుని, దఫదఫాలుగా రూ.1.20 లక్షలు చెల్లించాడు. తర్వాత నుంచి వారి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. వినాయక రత్నారావు ఫిర్యాదు మేరకు మంగళవారం తరువాత వారికి ఫోన్‌చేయగా స్విచ్ఆఫ్ అయ్యి ఉందని వన్‌టౌన్ ఎస్సై కె.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సీటీఆర్ఐ: ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు అని రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) డాక్టర్ చప్పిడి కృష్ణ అన్నారు. ఎస్‌కేవీటీ కళాశాలలో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవిత చరిత్రను చదివి, స్ఫూర్తి పొందాలన్నారు. మరో ముఖ్యఅతిథి, గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ వైఏ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్య సంస్థల్లో చదివిన విద్యార్థులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని, అందుకు తానే ఉదాహరణ అన్నారు. గౌరవ అతిథి, గెయిల్ సీనియర్ మేనేజర్ బి.బాలాజీ మాట్లాడుతూ నిరంతర శ్రమ, లక్ష్యసాధన, పట్టుదలే జీవితానికి చుక్కానిగా నిలుస్తాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎబెల్ రాజబాబు కళాశాల అభివృద్ధి నివేదికను సమర్పించారు. సీటీఆర్ఐ సైంటిస్ట్ డాక్టర్ కె.సుమన్ కల్యాణి, ఐపీఎస్సీ కోఆర్డినేటర్ డాక్టర్ డీవీ రమణమూర్తి, అకాడమిక్ కోఆర్డినేటర్ జి.శరత్ బాబు, జి.రమణ, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పీవీ సంజీవరావు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కడియంలో గడప గడపకూ మన ప్రభుత్వం



కడియంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. మండల కేంద్రమైన కడియంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం వలంటీర్లతో సమావేశమయ్యారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడున్నరేళ్లుగా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాజకీయ, వర్గ వ్యత్యాసాల్లేకుండా అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకం అందిస్తున్నామన్నారు. వీధిలైట్లు, రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను చందనకు స్థానికులు వివరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను చందన ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్రకార్యదర్శి గిరజాల వీర్రాజు, మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీను, ఎంపీటీసీ బట్టు స్వప్నదేవి, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, సాకా పట్టాభి, ఆర్ఎస్ఎన్ మూర్తి, దొడ్డా బుజ్జి, లావేటి రమేష్, సర్కార్ బాషా, గుత్తుల వాసు, కవల వెంకన్న పాల్గొన్నారు.

ఆలయ గోడ ధ్వంసం కేసులో ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు అఫీషియల్ కాలనీలోని వరసిద్ధి వినాయక దేవాలయం గోడను ధ్వంసం చేసిన కేసులో తాడేపల్లి వెంకటేశ్వరరావు(బోయోజు), దారా కృష్ణను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు రాజానగరం పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ మంగళవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వరసిద్ధి వినాయక దేవాలయాన్ని ఒక లేఅవుట్‌లో మిగిలిన క్రాస్‌బిట్‌లో నిర్మించారు. అయితే ఆ బిట్ తనదని తాడేపల్లి నాగేశ్వరరావు అనే వ్యక్తి పేర్కొనగా, దీనిపై రాజానగరం పోలీసులు ఈ స్థలం ఎవరిదో నిర్ధారించేందుకు రూరల్ తహశీల్దార్‌కు లెటర్ అడ్రస్ చేశారు. అనంతరం సెక్షన్ 145 సీఆర్‌పీసీ ప్రకారం వినాయక దేవాలయం కమిటీ సభ్యులకు, తాడేపల్లి నాగేశ్వరరావు నోటీసులు జారీ చేశాడు. అయితే ఇటీవల తాడేపల్లి నాగేశ్వరరావు మరణించారు. ఈ నేపథ్యంలో అతడి కుమారుడు తాడేపల్లి వెంకటేశ్వరరావు సోమవారం అక్రమంగా ఆలయంలోకి ప్రవేశించి గోడను ధ్వంసం చేశాడని ఆలయ కమిటీ ఫిర్యాదు చేసింది.



రెండో రౌండ్‌లో రామ్‌కుమార్ జోడీ

అడిలైడ్ ఓపెన్ ఇంటర్నేషనల్-2 టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్ (భారత్)-రేయస్ వరేలా (మెక్సికో) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రామ్-వరేలా ద్వయం 6-3, 7-6 (7/4)తో రాబిన్ హాస్-మిడిల్‌కూప్ (నెదర్లాండ్స్) జోడీని ఓడించింది. 76 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రామ్-వరేలా 14 ఏస్‌లు సంధించింది. రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీకి నేరుగా ప్రిక్వార్టర్ ఫైనల్‌కు 'బై' లభించింది.



ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీజ

ప్రపంచ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీటీసీ) ఆసియా క్వాలిఫయింగ్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. దోహాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో శ్రీజ 11-2, 5-11, 2-11, 5-11, 13-11, 11-9, 11-8తో చెన్ జు యు (చైనీస్ తైపీ)పై గెలిచింది. భారత్‌కే చెందిన మనిక బత్రా 13-11, 11-9, 11-6, 11-8తో చెంగ్‌జు జు (హాంకాంగ్)పై గెలుపొందగా... దియా చిటాలె, స్వస్తిక, రీత్ టెనిసన్ ఓడిపోయారు.

గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం



కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత్‌కు ఆశాజనక ఫలితాలు లభించలేదు. పురుషుల సింగిల్స్ విభాగంలో కిడాంబి శ్రీకాంత్... మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, ఆకర్షి కశ్యప్... పురుషుల డబుల్స్‌లో పంజాల విష్ణువర్ధన్ గౌడ్-గరగ కృష్ణప్రసాద్ తొలి రౌండ్‌లోనే ఓడిపోయారు. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ జోడీ 21-19, 21-14తో యంగ్ ఎన్గా టింగ్-యంగ్ పుయ్ లామ్ (హాంకాంగ్) ద్వయంపై గెలిచింది.

తొలి రౌండ్‌లోనే ఓడిన శ్రీకాంత్, సైనా

మరోవైపు ప్రపంచ మాజీ నంబర్‌వన్ సైనా నెహ్వాల్ 12-21, 21-17, 14-21తో హాన్ యుయె (చైనా) చేతిలో... ఆకర్షి కశ్యప్ 10-21, 8-21తో వెన్ చి సు (చైనీస్ తైపీ) చేతిలో ఓటమి పాలయ్యారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో విష్ణువర్ధన్-కృష్ణప్రసాద్ ద్వయం 10-21, 18-21తో కాంగ్ మిన్ హుక్-సియో సెయుంగ్ జే (దక్షిణ కొరియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 13వ ర్యాంకర్ శ్రీకాంత్ 19-21, 14-21తో ప్రపంచ 17వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్) చేతిలో అనూహ్యంగా ఓడిపోయాడు. గతంలో నిషిమోటోపై ఐదుసార్లు నెగ్గిన శ్రీకాంత్ 2018 తర్వాత ఈ జపాన్ ప్లేయర్ చేతిలో ఓటమి పాలయ్యాడు.

నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో కరోలినా మారిన్ (స్పెయిన్) పీవీ సింధు; ఆన్ సె యంగ్ (దక్షిణ కొరియా)తో మాళవిక... పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో లక్ష్య సేన్‌తో భారత్‌కే చెందిన ప్రణయ్ తలపడతారు.

హైదరాబాద్ 79 ఆలౌట్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ జట్టు చెత్త ప్రదర్శన కొనసాగుతోంది. మాజీ చాంపియన్ సౌరాష్ట్ర జట్టుతో మంగళవారం జింఖానా మైదానంలో మొదలైన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 30.5 ఓవర్లలో 79 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (23; 4 ఫోర్లు), భగత్ వర్మ (11; 2 ఫోర్లు), అనికేత్ రెడ్డి (10 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) మాత్రమే రెండంకెల స్కోరు దాటారు. కెప్టెన్ జైదేవ్ ఉనాద్కట్ (3/28), ధర్మేంద్ర సింగ్ జడేజా (3/8) హైదరాబాద్ జట్టును దెబ్బ తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన సౌరాష్ట్ర ఆట ముగిసే సమయానికి 54 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 250 పరుగులు సాధించింది. ప్రస్తుతం సౌరాష్ట్ర 171 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సంపాదించింది. హైదరాబాద్ బౌలర్లలో అనికేత్ రెడ్డి (3/74), రోహిత్ రాయుడు (2/20) రాణించారు.

రాణించిన జ్ఞానేశ్వర్



న్యూఢిల్లీ: ఢిల్లీ జట్టుతో మంగళవారం మొదలైన రంజీ ట్రోఫీ గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 203 పరుగులు సాధించింది. ఓపెనర్ సీఆర్ జ్ఞానేశ్వర్ (81; 14 ఫోర్లు), కెప్టెన్ విహారి (76 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధ సెంచరీలు చేశారు.

తొలిసారి మహిళా అంపైర్లు...

రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో మంగళవారం తొలిసారి మహిళా అంపైర్లు అంపైరింగ్ బాధ్యతలు చేపట్టారు. జంషెడ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్-జార్ఖండ్ మ్యాచ్ కు గాయత్రి వేణుగోపాలన్... సూరత్‌లో రైల్వేస్-త్రిపుర మ్యాచ్‌కు జననీ నారాయణన్... పోర్వోరిమ్‌లో పాండిచ్చేరి-గోవా మ్యాచ్‌కు వృందా రాఠి అంపైర్లుగా వ్యవహరిస్తున్నారు.

'రూట్స్ కొలీజియం'తో జత కట్టిన హంపి



సాక్షి, బంజారాహిల్స్: 'రూట్స్ కొలీజియం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్' సంస్థ తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్, 2019 ప్రపంచ ర్యాపిడ్ చెస్ విజేత కోనేరు హంపిని నియమించింది. తన కొత్త భాగస్వామ్యంపై హంపి మాట్లాడుతూ...'రూట్స్ కొలీజియంతో కలిసి పని చేయనుండటం సంతోషంగా ఉంది. నా చెస్ అనుభవాలను, ఆలోచనలను ఇక్కడి విద్యార్థులతో పంచుకుంటాను. నాకు తెలిసిన అంశాలు వారికి ఏదో రూపంలో ఉపయోగపడాలని కోరుకుంటున్నా' అని వ్యాఖ్యానించింది. ఈ కార్యక్రమంలో రూట్స్ కొలీజియం చైర్మన్ బీపీ పడాల కూడా పాల్గొన్నారు.

భారత్ 'టాప్'గేర్

- 'శత'క్కొట్టిన కోహ్లి
- రోహిత్, గిల్ దూకుడు
- తొలి వన్డేలో లంకపై 67 పరుగులతో భారత్ విజయం
- షనక సెంచరీ వృథా
- కోల్‌కతాలో రేపు రెండో వన్డే

కొత్త ఏడాదిలో ఆడిన తొలి వన్డే మ్యాచ్‌లో భారత జట్టు దుమ్మురేపింది. సొంతగడ్డపై ఈ ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ టోర్నీకి భారీ విజయంతో సన్నాహాలు మొదలుపెట్టింది. దాదాపు నాలుగేళ్ల నిరీక్షణకు తెరదించుతూ కోహ్లి స్వదేశంలో వన్డేల్లో మళ్లీ సెంచరీ కొట్టగా... రోహిత్ శర్మ, శుబ్‌మన్ గిల్ కూడా మెరిశారు. ఫలితంగా శ్రీలంకపై గెలుపుతో 'వరల్డ్‌కప్ నామ' సంవత్సరానికి టీమిండియా ఘనమైన ఆరంభాన్నిచ్చింది.



కోహ్లి సెంచరీ అభివాదం

9 శ్రీలంకపై అత్యధికంగా తొమ్మిది సెంచరీలు చేసిన బ్యాటర్‌గా కోహ్లి నిలిచాడు. సచిన్ (8) పేరిట ఉన్న రికార్డును కోహ్లి సవరించాడు.

20 స్వదేశంలో అత్యధిక సెంచరీలు చేసిన క్రికెటర్‌గా సచిన్ (20) పేరిట ఉన్న రికార్డును తాజా శతకంతో కోహ్లి (20 సెంచరీలు) సమం చేశాడు.

గువహటి: 'టాప్'ఆర్డర్ బ్యాటర్ల వీరవిహారం చేయడంతో శ్రీలంకతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భారత్ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా 67 పరుగుల ఆధిక్యంతో ఘనవిజయం సాధించి సిరీస్ లో 1-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. రెండో వన్డే రేపు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. మొదట భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 373 పరుగుల భారీ స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విరాట్ కోహ్లి (87 బంతుల్లో 113; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదంతొక్కాడు. ఓపెనర్లు రోహిత్ శర్మ (67 బంతుల్లో 83; 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శుబ్‌మన్ గిల్ (60 బంతుల్లో 70; 11 ఫోర్లు) చెలరేగారు. అనంతరం శ్రీలంక 50 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసి ఓడిపోయింది. కెప్టెన్ దసున్ షనక (88 బంతుల్లో 108 నాటౌట్; 12 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ సెంచరీ సాధించాడు. నిసాంక (80 బంతుల్లో 72; 11 ఫోర్లు) రాణించాడు.

అదరగొట్టిన ఓపెనర్లు

విశ్రాంతి తర్వాత ఈ ఏడాదిని ఆరంభించిన కెప్టెన్ రోహిత్ శర్మ మునుపటి 'హిట్‌మ్యాన్'లా ఆడాడు. గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌కు శుభారంభం అందించాడు. రజిత వేసిన ఏడో ఓవర్లో రోహిత్ 2 సిక్స్‌లు, ఒక బౌండరీతో 17 పరుగులు పిండుకున్నాడు. మదుషంక ఓవర్లో 'హ్యాట్రిక్' ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన గిల్ కూడా బాదడం మొదలు పెట్టడంతో లంక బౌలర్లకు కష్టాలు తప్పలేదు. దునిత్ 19వ ఓవర్లో గిల్ 4, 4, 4, 1 కొడితే ఆఖరి బంతిని రోహిత్ సిక్సర్‌గా బాదాడు. 20వ ఓవర్ వేసిన షనక... గిల్‌ను అవుట్ చేసి 143 పరుగుల భాగస్వామ్యానికి తెరదింపాడు.

కోహ్లి కమాల్...

గిల్ అవుటయ్యాక కోహ్లి రాగా... కాసేపటికే రోహిత్‌ని మదుషంక బౌల్డ్ చేశాడు. లంక హమ్మయ్య! అనుకునేలోపే మరో ధాటైన ఇన్నింగ్స్‌కు కోహ్లి శ్రీకారం చుట్టాడు. బౌండరీలతో చకచకా పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 47 బంతుల్లో (3 ఫోర్లు, 1 సిక్స్) ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. వ్యక్తిగత స్కోరు 52, 81 పరుగుల వద్ద లైఫ్‌లు పొందిన కోహ్లి సెంచరీ దిశగా తనదైన శైలీ షాట్లతో అలరించాడు. 41వ ఓవర్లో భారత్ 300 మార్క్ చేరుకోగా, కోహ్లి 80 బంతుల్లో (10 ఫోర్లు, 1 సిక్స్) తన వన్డే కెరీర్‌లో 45వ సెంచరీ సాధించాడు. 2019 మార్చి 8న ఆస్ట్రేలియాపై రాంచీలో చివరిసారి స్వదేశంలో వన్డేల్లో కోహ్లి సెంచరీ చేశాడు. 49వ ఓవర్లో కోహ్లిని రజిత అవుట్ చేశాడు.

లంకకు పేస్ దెబ్బ

భారత సీమర్లు సిరాజ్, ఉమ్రాన్, షమీల పేస్ బౌలింగ్‌కు శ్రీలంక ఇన్నింగ్స్ ఆరంభం నుంచే కష్టాల్లో పడింది. నిసాంక బాధ్యతగా ఆడినప్పటికీ టాపార్డర్ బ్యాటర్స్



షనక

అవిష్క ఫెర్నాండో (5), కుశాల్ మెండిస్ (0)లను సిరాజ్ తన వరుస ఓవర్లలో పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత కూడా వరుస విరామాల్లో మిడిలార్డర్ వికెట్లను సీమర్లు కూల్చారు. 206 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి ఓటమిని ఖాయం చేసుకున్న లంకను కెప్టెన్ షనక ఆదుకున్నాడు. షనక టెయిలెండర్ రజిత (9 నాటౌట్)తో కలిసి తొమ్మిదో వికెట్ కు 100 పరుగులు జోడించారు.

భారత్ క్రీడాస్ఫూర్తి

ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ వేసిన షమీ... సెంచరీకి రెండే పరుగుల దూరంలో ఉన్న షనక (98 వద్ద) మన్కడింగ్ చేశాడు. నిజానికి ఇది అవుటే! కానీ కెప్టెన్ రోహిత్... షమీ దగ్గరకొచ్చి వారించాడు. వెంటనే షమీ అంపైర్‌తో అప్పీల్‌ను వెనక్కి తీసుకున్నాడు. దీంతో షనక ఐదో బంతికి ఫోర్ కొట్టి సెంచరీ సాధించగలిగాడు.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (బి) మదుషంక 83; గిల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షనక 70; కోహ్లి (సి) మెండిస్ (బి) రజిత 113; అయ్యర్ (సి) ఫెర్నాండో (బి) ధనంజయ 28; కేఎల్ రాహుల్ (బి) రజిత 39; పాండ్యా (సి) హసరంగ (బి) రజిత 14; అక్షర్ (సి) ఫెర్నాండో (బి) కరుణరత్నే 9; షమీ (నాటౌట్) 4; సిరాజ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 373. వికెట్ల పతనం:** 1-143, 2-173, 3-213, 4-303, 5-330, 6-362, 7-364. **బౌలింగ్:** కసున్ రజిత 10-0-88-3, మదుషంక 6-0-43-1, హసరంగ 10-0-67-0, కరుణరత్నే 8-0-54-1, దునిత్ 8-0-65-0, షనక 3-0-22-1, ధనంజయ 5-0-33-1.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) అక్షర్ (బి) ఉమ్రాన్ 72; ఫెర్నాండో (సి) పాండ్యా (బి) సిరాజ్ 5; మెండిస్ (బి) సిరాజ్ 0; అసలంక (సి) రాహుల్ (బి) ఉమ్రాన్ 23; ధనంజయ (సి) రాహుల్ (బి) షమీ 47; షనక (నాటౌట్) 108; హసరంగ (సి) అయ్యర్ (బి) చహల్ 16; దునిత్ (సి) గిల్ (బి) ఉమ్రాన్ 0; కరుణరత్నే (సి) రోహిత్ (బి) పాండ్యా 14; రజిత (నాటౌట్) 9; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (50 ఓవర్లలో 8 వికెట్లకు) 306. వికెట్ల పతనం:** 1-19, 2-23, 3-64, 4-136, 5-161, 6-178, 7-179, 8-206. **బౌలింగ్:** షమీ 9-0-67-1, సిరాజ్ 7-1-30-2, పాండ్యా 6-0-33-1, ఉమ్రాన్ 8-0-57-3, చహల్ 10-0-58-1, అక్షర్ 10-0-58-0.

సినిమా

మా ఇల్లే పాన్ ఇండియా



శ్రుతీహాసన్

శ్రుతీహాసన్ ఏదీ ప్లాన్ చేయరు. సినిమాలంటే ఆమెకు చాలా ఇష్టం. అయితే ఇన్నేళ్లు ఉండాలని ప్లాన్ చేయలేదు. సినిమాకి దూరం కాకూడదనుకుంటారు. అంతే.. ఇక బాబీ దర్శకత్వంలో చిరంజీవితో చేసిన 'వాల్తేరు వీరయ్య', గోపీచంద్ దర్శకత్వంలో బాలకృష్ణతో చేసిన 'వీరసింహారెడ్డి'తో ఈ సంక్రాంతికి డబుల్ ట్రీట్ ఇవ్వనున్నారామె. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన 'వీరసింహారెడ్డి' ఈ 12న, 13న 'వాల్తేరు వీరయ్య' రిలీజ్ కానున్నాయి. ఈ సందర్భంగా శ్రుతి చెప్పిన విశేషాలు..

● రెండు చిత్రాలతో మీతో మీరే పోటీ పడటం ఎలా ఉంది?

నిజానికి ఇది ఊహించలేదు. తొమ్మిదేళ్ల క్రితం నా రెండు సినిమాలు ఒకేసారి రిలీజయ్యాయి. అయితే పండగప్పుడు కాదు. ఫెస్టివల్ టైమ్‌లో రెండు పెద్ద చిత్రా లతో.. ఇద్దరు లెజెండరీ (చిరంజీవి, బాలకృష్ణ) హీరోల సినిమాలతో రావడం ఆశీర్వాదం అనుకుంటున్నా.

● రెండు సినిమాలూ హిట్టవ్వాలనే ఓ టెన్షన్ ఉంటుంది కదా...

టెన్షన్ అనేది సెట్లో పని చేస్తున్నప్పుడు మాత్రమే. ఎక్స్‌ప్రెషన్ సరిగ్గా వచ్చిందా? లేదా డైలాగ్ బాగా చెప్పానా? లేదా అనే టెన్షన్ ఉంటుంది. సెట్ నుంచి బయటికొచ్చేస్తే టెన్షన్ ఉండదు. ఎందుకంటే మిగతాదంతా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది.

● 'వాల్తేరు..', 'వీరసింహా...'లలో ఏ సినిమాలో మీ పాత్ర బాగుంటుందనే పోలిక రావడం సహజం..

నిజమే. అయితే రెండు సినిమాల కథలు, పాత్రలు, ట్రీట్‌మెంట్ భిన్నంగా ఉంటాయి. నా పాత్రలు డిఫరెంట్‌గా, సవాల్‌గా ఉంటాయి. 'వీరసింహా..'లో నా పాత్ర కామెడీగా ఉంటుంది. కామెడీ చేయడం కష్టం. 'వాల్తేరు...'లో నా పాత్రని బాగా రాశారు.

● చిరంజీవి, బాలకృష్ణలతో డ్యాన్స్ చేయడం...

నైస్ ఎక్స్‌పీరియన్స్. 'వీరసింహారెడ్డి'లోని 'సుగుణసుందరి...' స్టెప్ బాగా రీచ్ అయ్యింది. అలాగే 'వాల్తేరు వీరయ్య'లోని 'శ్రీదేవి... చిరంజీవి' పాట కూడా అద్భుతంగా వచ్చింది.

● ఒక పాట మంచి ఎండ (సుగుణ సుందరి)లో.. మరో పాట (నువ్వు శ్రీదేవి అయితే.. నేను చిరు) విపరీతమైన చలిలో చేసిన అనుభవం గురించి?

ఇండియన్స్‌కి ఎండ సమస్య కాదు. కానీ చలి తట్టుకోవడం కష్టం. పైగా పల్చటి చీరలో మైనస్ 11 డిగ్రీల చలిలో చేయాల్సి వచ్చింది.

● ఈ విషయంలో హీరోయిన్లకే సమస్య. హీరోలు ఫుల్‌గా కవర్ చేసుకునే వీలు ఉంటుంది...

యూనిట్ అంతా నాలుగైదు లేయర్ల కోట్స్ వేసుకుంటే మేం చలిలో డ్యాన్స్ చేశాం (నవ్వుతూ). సార్ (చిరంజీవి) కూడా పెద్దగా కవర్ చేసుకోలేదు. ఒక కోట్.. అంతే.

● 'వీరసింహారెడ్డి' వేడుకలో పాల్గొన్న మీరు 'వాల్తేరు వీరయ్య' వేడుకలో పాల్గొనలేదు.. కారణం?

ఆరోగ్యం బాగాలేదు. పూర్తిగా రికవర్ కాకపోవడంతో వేడుకకు వెళ్లలేకపోయా. ఐయామ్ సో సారీ.

● ఆ మధ్య మీకు తెలుగులో గ్యాప్ వచ్చింది... ఇప్పుడు ఇద్దరు సీనియర్ హీరోలతో, యంగ్ హీరో ప్రభాస్‌తో 'సలార్'.. వరుసగా సినిమాలు చేయడం ఎలా ఉంది?

మా ఇంట్లో మా అమ్మానాన్నని చూసి సినిమా అనేది ఫ్యామిలీ అనిపించింది. ఇక ఇండస్ట్రీ, ఆడియన్స్ పరంగా తెలుగు నాకు రియల్ ఫ్యామిలీ అంటాను. ఎందుకంటే సౌత్‌లో నేను పరిచయం అయింది తెలుగు సినిమాల ద్వారానే. ఒక కొత్త ప్రాంతంలో నాకు మంచి ఆహ్వానం దక్కింది. ప్రేక్షకులు నన్ను అంగీకరించారు. హిట్ ఇచ్చారు. 'క్రాక్' తర్వాత మళ్లీ తెలుగులో వరుసగా సినిమాలు చేయడం ఆనందంగా ఉంది.

'పాన్ ఇండియా' ట్రెండ్ గురించి మీ అభిప్రాయం?

నిజానికి నా లైఫ్ చూస్తే.. నేను పాన్ ఇండియన్‌ని (నవ్వుతూ). మా అమ్మ ముంబై (సారిక).. నాన్న (కమల్‌హాసన్) తమిళనాడు. మా డైనింగ్ టేబుల్ మీద మహారాష్ట్రియన్ ఫిష్ కర్రీ, చపాతి, సాంబార్, రైస్ అన్నీ ఉంటాయి. మాది ప్రాపర్ ఇండియన్ హోమ్. అమ్మ ముంబై నుంచి చెన్నై వెళ్లి తమిళ్ నేర్చుకున్నారు. మాట్లాడటం మాత్రమే కాదు.. రాయడం కూడా నేర్చుకున్నారు. నాన్న తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ, బెంగాలీ.. ఇలా చాలా భాషలు మాట్లాడతారు. ఇంట్లో హిందీ, తమిళ్, ఇంగ్లిష్ మాట్లాడతాం. నా చిన్నప్పుడు ఒక సినిమా రిలీజ్ అంటే ముంబై, అట్నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్, లేకపోతే చెన్నై.. ఇలా వెళ్లేవాళ్లం. పాన్ ఇండియా కాన్సెప్ట్ అనేది నా మైండ్‌లో చిన్నప్పుడే ఉంది. అయితే బాలీవుడ్, టాలీవుడ్ అని పేరు వచ్చినప్పుడు మా నాన్న 'ఇండియన్ సినిమా అందాం. ఆ తర్వాత భాష గురించి మాట్లాడదాం' అనేవారు. నేను పుట్టి, పెరిగింది చెన్నైలోనే. కానీ హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా పరిచయమయ్యాను. అట్నుంచి తెలుగుకి వచ్చాను. ఆ తర్వాతే తమిళ్‌కి పరిచయం అయ్యాను. చెప్పాలంటే 'మా ఇల్లే పాన్ ఇండియా'. ఇప్పుడు పాన్ ఇండియా అంటూ అందరూ అన్ని సినిమాలూ చూడటం పాజిటివ్ విషయం.

సంక్రాంతి ఎలా జరుపుకుంటారు?

'సంక్రాంతి' అనే పదం నేను తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన తర్వాతే నా లైఫ్‌లోకి వచ్చింది. మాకు తమిళ్‌లో 'పొంగల్' అంటాం. పండగ రోజు పొంగలి వండుతాను. పూజ చేస్తాను. ఫ్యామిలీతో గడుపుతాను.

గోపీచంద్ మలినేని మిమ్మల్ని లక్కీ హీరోయిన్ అంటారు. లక్‌ని మీరు నమ్ముతారా?

లేదు.. హార్డ్ వర్క్‌ని, దేవుడిని నమ్ముతాను. ఒకవేళ ఎవరైనా నన్ను లక్కీ అంటే వాళ్లకు థ్యాంక్స్ చెబుతాను. అయితే నేను లక్, అన్‌లక్‌ని నమ్మను. ఎందుకంటే ఒకప్పుడు నన్ను 'అన్‌లక్కీ' అన్నారు. ఆ తర్వాత 'లక్కీ' అన్నారు. వేరేవాళ్లు నన్ను అలా అనడం ఆశీర్వాదంలా భావిస్తున్నాను.

సీనియర్ హీరోల సరసన సినిమా చేస్తే ఇక ఆ హీరోయిన్ సీనియర్ హీరోల సినిమాలకే అని ఫిక్స్ అవుతుంటారు. ఇలాంటి టైమ్‌లో ప్రభాస్‌లాంటి యంగ్ హీరోతో 'సలార్' చాన్స్ రావడం అడ్వాంటేజ్ అనుకుంటున్నారా?

కథ, నా క్యారెక్టర్ మాత్రమే చూస్తాను. 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య' కథలు, నా పాత్రలు నచ్చాయి. ఫస్ట్ నుంచీ సినిమాని సినిమాగా చూసి, ఒప్పుకోవడం నాకు అలవాటు. అంతేకానీ వేరేవాళ్లు ఏమనుకుంటారో అని ఆలోచించి ఒప్పుకోను. నాకు ఏది కరెక్ట్ అనిపిస్తే అది చేస్తాను. 'సలార్' విషయానికి వస్తే.. నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టం. ప్రశాంత్ సార్ సినిమాలంటే ఇష్టం. ఆ పరంగా నేను హ్యాపీ. అది నాకు అడ్వాంటేజ్ అనుకుంటున్నాను.

ఆస్కార్ షార్ట్ లిస్ట్‌లో...

పది భారతీయ చిత్రాలు







ప్రతిష్టాత్మక 95వ ఆస్కార్ అవార్డ్స్ వేడుక ఈ ఏడాది మార్చి 12న జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 301 చిత్రాలు ఈ ఏడాది ఆస్కార్ పురస్కారాల కోసం పోటీ పడుతున్నాయి. వాటిలో ఇండియా నుంచి 10 సినిమాలు ఆస్కార్ అవార్డుల నామినేషన్ బరిలో ఉన్నాయి. తొలి జాబితాలో 'ఆర్ఆర్ఆర్ (తెలుగు), చెల్లో షో (గుజరాతీ), మీ వసంతరావ్ (మరాఠీ), తుజ్యా సాఠీ కహీ హై (మరాఠీ), ఇరవిన్ నిళల్ (తమిళ్)' వంటి చిత్రాలు ఇప్పటికే ఆస్కార్ నామినేషన్స్ షార్ట్ లిస్ట్‌లో ఉన్నాయి. కాగా ఆస్కార్ అవార్డులకు పోటీపడేందుకు అవకాశం ఉన్న 301 చిత్రాల్లోని మిగతా జాబితాను అవార్డ్స్ కమిటీ మంగళవారం వెల్లడించింది. అందులో 'ది కశ్మీరీ ఫైల్స్' (హిందీ), 'గంగూబాయి కతియావాడి' (హిందీ), 'కాంతార' (కన్నడ), 'విక్రాంత్ రోణ' (కన్నడ), 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' (తమిళ్)' చిత్రాలు ఉన్నాయి. కాగా ఇండియా తరఫున గుజరాతీ సినిమా 'ఛెల్లో షో' ఆస్కార్ బరిలో నిలుస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా 'ఆర్ఆర్ఆర్' సినిమాతో పాటు మరికొన్ని చిత్రాలు ఓపెన్ కేటగిరీలో నిలిచాయి.

ఇక ఏయే సినిమా ఏయే విభాగంలో పోటీ పడుతుందనే విషయానికి వస్తే.. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన 'ఆర్ఆర్ఆర్' బెస్ట్ ఒరిజినల్ స్కోర్ విభాగం (నాటు నాటు.. పాట)లో షార్ట్ లిస్ట్‌లో నిలిచింది. ఈ చిత్రానికి కీరవాణి సంగీత దర్శకుడు. అలాగే ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలోనూ 'ఆర్ఆర్ఆర్' షార్ట్‌లిస్ట్ అయిన సంగతి తెలిసిందే.

కాగా ఉత్తమ చిత్రం, ఉత్తమ నటుడు విభాగాల్లో 'కాంతారా' ఎంపికైంది. రిషబ్ శెట్టి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ఇది.

అదే విధంగా సుదీప్ హీరోగా అనూప్ బండారి దర్శకత్వం వహించిన కన్నడ చిత్రం 'విక్రాంత్ రోణ', సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో ఆలియా భట్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ చిత్రం 'గంగుబాయి కతియావాడి', వివేక్ అగ్నిహోత్రి దర్శకత్వంలో రూపొందిన 'ది కశ్మీరీ ఫైల్స్' వంటివి ఉత్తమ చిత్రం కేటగిరీలో షార్ట్ లిస్టులో చోటు సంపాదించుకున్నాయి.

నేటి నుంచి ఓటింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 17 వరకు ఓటింగ్‌కు అవకాశం ఉంటుంది. షార్ట్ లిస్ట్‌లోని తుది నామినేషన్లను ఈ నెల 24న ప్రకటిస్తారు.

పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది

- ఎస్ఎస్ తమన్



"పోటీ అనేది సినిమాల్లోనే కాదు.. ప్రతి చోటా ఉంటుంది. పోటీ ఉన్నప్పుడే మంచి కంటెంట్ వస్తుంది. ఆరోగ్యకరమైన పోటీ మంచిదే. అన్ని సినిమాలూ గొప్పగా ఆడాలి.. అందరూ బాగుండాలి" అని సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ అన్నారు. బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా రేపు (గురువారం) రిలీజవుతోంది. ఈ చిత్రానికి సంగీతం అందించిన తమన్ చెప్పిన విశేషాలు.

● బాలకృష్ణగారితో నేను చేసిన 'అఖండ' సినిమాతో 'వీరసింహారెడ్డి'కి పోలికే లేదు. ఇది కల్ట్ మూవీ. ఎమోషనల్, సిస్టర్ సెంటిమెంట్, బాలకృష్ణగారి మాస్.. ఇలా అన్ని అంశాలతో అదిరిపోతుంది. ● దర్శకుడు మంచి సినిమా తీస్తేనే నేను మంచి మ్యూజిక్ ఇవ్వగలను. ఒక సినిమాకి పునాది దర్శకుడే. బాలకృష్ణగారి అభిమానిగా గోపీచంద్ చాలా గొప్పగా తీశారు.. దాని వల్లే నాకూ మంచి మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చే అవకాశం వచ్చింది. సినిమా ఏం కోరుకుంటుందో అది ఇవ్వడమే మన పని. ఇందులో 'జై బాలయ్య, సుగుణ సుందరి, మాస్ మొగుడు..' వంటి పాటలన్నీ చక్కగా కుదిరాయి. మాస్ సినిమాలో కూడా కథ నుండే ట్యూన్ పుడుతుంది. ● 'అఖండ'లో మ్యూజిక్‌కి స్పీకర్లు పగిలిపోయాయి. 'వీరసింహారెడ్డి'లోనూ స్పీకర్లు పగులుతాయి జాగ్రత్త అని ముందే చెప్పాను. బాలకృష్ణగారిని చూస్తేనే ఎక్కువ వాయించేయాలనిపిస్తుంది (నవ్వుతూ). చాలా రోజుల తర్వాత సెకండ్ హాఫ్‌లో నాలుగు పాటలు, నాలుగు ఫైట్లతో అదరగొట్టే సినిమా ఇది. పాప్ కార్న్ తినే టైమ్ కూడా ఉండదు.. సినిమాని చూస్తూనే ఉంటారు. ● ఈ సంక్రాంతికి విడుదలవుతున్న చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' రెండూ గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను.

వినరో... విష్ణు తత్త్వం




● కశ్మీరా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, కశ్మీరా పరదేశీ జంటగా మురళీ కిశోర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ2 పిక్చర్స్‌పై బన్నీ వాసు నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 17న రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా 'బన్నీ' వాసు మాట్లాడుతూ– "ఈ సినిమా కథ చెప్పినప్పుడే టైటిల్ చెప్పాడు మురళీ కిశోర్. నేను కథ మొత్తం విన్నాక 'ఇందులో ఏమైనా దేవుడి ఎలిమెంట్ ఉందనుకుంటున్నారా?' అని అడిగాడు. విష్ణు తత్త్వం ఇంత క్లారిటీగా కనిపిస్తోంది కదా! అన్నాను. ఒక మనిషి చిరునవ్వుని, అవతలవాడికి సాయపడే విధానాన్ని చాలా కమర్షియల్‌గా చెప్పినందుకు మురళికి థ్యాంక్స్" అన్నారు. "ఈ సినిమా మాది అనుకుని పని చేసిన టీమ్‌కి థ్యాంక్స్" అన్నారు మురళీ కిశోర్. "గీతా ఆర్ట్స్‌లో సినిమా చేసే అవకాశం ఇచ్చిన బన్నీ వాసుగారికి థ్యాంక్స్" అన్నారు కిరణ్ అబ్బవరం.

నా కల తీరుతోంది

- సంతోష్ శోభన్



"నాన్న (శోభన్) దర్శకత్వంలో ప్రభాస్ అన్న నటించిన 'వర్షం' సినిమా 2004లో సంక్రాంతికి విడుదలై హిట్ అయింది. నా సినిమాని కూడా సంక్రాంతికి రిలీజ్ చేసుకోవాలనేది నా కల.. 'కళ్యాణం కమనీయం' చిత్రంతో అది తీరుతోంది" అని హీరో సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్ జంటగా నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సంతోష్ శోభన్ మాట్లాడుతూ– "ఈ సంక్రాంతికి బిగ్ స్టార్స్ సినిమాలు కూడా విడుదలవుతున్నాయి. నేను కూడా 'వీరసింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు' చిత్రాలు చూస్తాను. నా సినిమా కాబట్టి 'కళ్యాణం కమనీయం' నాకు మరింత స్పెషల్. పెళ్లైన ఓ కొత్త జంట తమ వైవాహిక జీవితంలో ఎదురైన పరిస్థితులను తట్టుకుని ఎలా ముందుకు సాగింది? అనేది 'కళ్యాణం కమనీయం' కథ. యూవీ క్రియేషన్స్‌లో మూడు చిత్రాలు చేశాను.. మరో ముప్పై చేసేందుకైనా సిద్ధం. నా లైఫ్‌లో పేరున్న దర్శకులు మారుతి, మేర్లపాక గాంధీలాంటి వారితో సినిమాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాను" అన్నారు.